# వైద్యం అందేదెట్లా?

- నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యుల పోస్టులు
- ఇబ్బందులు పడుతున్న పేదలు


పీహెచ్‌సీలో మహిళకు బీపీ చూస్తున్న నర్సు


నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్యకేంద్రం)లో గత కొన్నిరోజులుగా వైద్యులు లేకపోవడంతో పేదలకు వైద్యం అందడం లేదు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకుగానూ చాలాఏళ్లుగా ఒకే వైద్యాధికారితో నెట్టుకొస్తున్నారు. 2021లో రెండు డాక్టర్ల పోస్టులు ఖాళీ కావడంతో కాంట్రాక్ట్ పద్ధతిపద్ధతిపై ఒక డాక్టర్‌ను నియమించారు. తాజాగా ఆయన సైతం రెగ్యూలర్ వైద్యుడిగా నియామకం కావడంతో కౌన్సిలింగ్‌లో ఎల్లారెడ్డి మండలం మత్తమాల పీహెచ్‌సీలో పోస్టింగ్ తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో రోగుల నాడిపట్టే నాథుడే లేకుండాపోయారు. నాగిరెడ్డిపేట మండలానికి ఉన్న ఒకేఒక పీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంతో పేద ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**నర్సులు, ఏఎన్‌ఎంలే వైద్యులు..**

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో తరుచూ డాక్టర్ల కొరత ఏర్పడుతుంది. రెండేళ్ల క్రితం సైతం పీహెచ్‌సీలో ఉన్న ఒకే ఒక డాక్టర్ నందిత బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లిపోవడంతో చాలా రోజులపాటు పీహెచ్‌సీలో డాక్టర్‌ను నియమించలేదు. ఆ సమయంలో లింగంపేట పీహెచ్‌సీ డాక్టర్‌కు డీడీవోకు సంబంధించిన బాధ్యతలను ఇన్‌చార్జిగా అప్పగించారు. ఫిబ్రవరి, 2022లో కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్ శరత్‌ను నియమించారు. సుమారు 10నెలల పాటు విధులు నిర్వహించిన అతడు డిసెంబర్‌లో రెగ్యూలర్ వైద్యుడిగా ఉద్యోగం పొంది, వేరే ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో డాక్టర్ల కొరత కారణంగా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలే వైద్యం చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యం అందక నిరుపేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### డాక్టర్ ఉండాలే..



సర్కారు దవాఖానాల్లో డాక్టర్లు ఉండాలే. మంచిగ సూస్తరని మాలాంటి పేదోళ్లు సర్కారు దవాఖానాకే అస్తరు. కానీ గోపాల్‌పేట దవఖానాలో డాక్టర్లు ఉండకపోవడంతో గరీబోళ్లకు తిప్పలైతుంది. పెద్దసార్లు దయతలచి మా దవాఖానాకు డాక్టర్‌ను పంపాలే.

– బొగ్గుల లక్ష్మి, గోపాల్‌పేట

### నర్సులే సూస్తుండ్రు...



సర్కార్ దవాఖానాల వైద్యం చేయించుకుందామని నాగిరెడ్డిపేట ఆస్పత్రికి వస్తే ఈడ డాక్టర్ లేడని తెలిసింది. ఆస్పత్రిలో ఉన్న నర్సు లే చూసి మందులు ఇచ్చి పంపిండ్రు. డాక్టర్లు ఉంటేనే మాలాంటోళ్ల కు మంచిగుంటది. ఆస్పత్రిల డాక్టర్లను పెడితే ఆస్పత్రికి వచ్చిన ప్రతిఒక్కరికి వైద్యం అందుతది.

– మెరిగె బాలయ్య, చీనూర్

### ఇన్‌చార్జి వైద్యుడిని నియమిస్తాం..

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో డాక్టర్లు లేని మాట వాస్తవమే. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి వచ్చే రోగులకు స్టాఫ్‌నర్సులే వైద్యం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సైతం తెలియజేశాము. రెండు రోజుల్లో పీహెచ్‌సీకి ఇన్‌చార్జి వైద్యుడిని నియమిస్తాము.

– శోభారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఎల్లారెడ్డి

## క్లుప్తంగా

### అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



బాన్సువాడ టౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. బాన్సువాడలోని తన నివాసంలో బుధవారం హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి గడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



నిజాంసాగర్(జుక్కల్): మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలపై అన్యాయాలు జరుగకుండా కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీసీఎస్ సీడీపీవో కళావతి, సూపర్ వైజర్లు లక్ష్మి, రాజేశ్వరి, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

### పరీక్షల షెడ్యూల్ సవరించాలి

కామారెడ్డి టౌన్: ఎస్‌ఎస్‌సీ పరీక్షల ప్రశ్నాపత్రంలో 33శాతం అంతర్గత ఛాయిస్ ప్రశ్నలతో పరీక్షల షెడ్యూల్ సవరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అనిల్, ఉపాధ్యాక్షుడు దినేష్, నాయకులు కృష్ణ, అరవింద్ తదితరులున్నారు.

### ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేయాలి



కామారెడ్డి టౌన్: పట్టణానికి అనుకొని ఉన్న సిరిసిల్లారోడ్‌లోని పంట భూముల్లో ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేయాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ భూముల పక్కనే గృహాలు ఉన్నాయని, సిరిసిల్లారోడ్‌లో ఎడమ వైపు ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేసారని, తమ భూముల్లో మాత్రం అలానే ఉంచారని అన్నారు. తక్షణమే ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేయాలని కోరారు.

### బడిలో సంక్రాంతి సంబురాలు



దోమకొండ: మండలంలోని సీతారంపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. ముగ్గులను వేసి సంబురాలు జరుపుకున్నారు. ప్రిన్సిపల్ మమత, ఉపాధ్యాయు లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

ఎల్లారెడ్డి: చైనా మాంజా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలి పటాలను ఎగురవేసే వారు చైనా మాంజాను వినియోగించవద్దని అన్నారు. ప్రభుత్వం చైనా మాంజాను బ్యాన్ చేసిందన్నారు. చైనా మాంజా విక్రయించినట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

### ప్రతిరోజూ చెత్త సేకరించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని ఎంపీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ధర్మారెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు రాయాలని ఆయన సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### జీపీ ట్రాక్టర్లకు జీపీఎస్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గ్రామ పంచాయతీల ట్రాక్టర్లకు బుధవారం జీపీఎస్ విధానం అమలు చేసినట్లు ఎంపీవో ప్రభాకరచారి తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారదర్శకత కోసమే ఈవిధానం అమలులోకి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## బీటీ రోడ్లతో గ్రామాలకు కొత్త అందం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే
- పెద్దతడ్గూర్ రహదారి పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): బీటీ రోడ్లతో గ్రామాలకు కొత్త అందం సంతరించుకుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తడ్గూర్ వద్ద కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే పెద్ద తడ్గూర్ రహదారి సమీపంలోని కంది పంట కల్లం చూసి తన వాహనాన్ని నిలిపి కల్లం వద్దకు వెళ్లారు. దిగుబడి ఎలా వస్తుందని.. ఖర్చు ఎంతైనదని ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బస్వరాజ్‌పటేల్ తదితరులు పాలొకగన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నాల్చర్ రాజు, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్
- తాడ్వాయిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో పలువురు లబ్దిదారులకు బుధ వారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు ఏ రాష్ట్రంలో జరగడం లేదన్నారు.

**వాలీబాల్ పోటీలు ప్రారంభం..**

అనంతరం తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజక వర్గస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. 54వాలీబాల్ టీంలు పోటీలలో పాల్గొంటున్నాయి. విజేతకు రూ.21వేలు, రన్నర్‌కు రూ.20వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేల చొప్పున అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలపారు. సర్పంచ్ సంజీవులు, పార్టీ మండల అధ్యక్షుడు వెల్మరవిందర్‌రెడ్డి, ఎంపీపీ కొడి రవి, జెడ్పీటీసీ రమాదేవి, వైస్ ఎంపీపీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..

**ఊరెళితే సమాచారం ఇవ్వండి..**

మద్నూర్(జుక్కల్): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఊరెళితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై నిఘా ఉంచుతామని ఎస్సై తెలిపారు. ఇళ్లలో విలువైన వస్తువులు, డబ్బులు ఉంచకుండ తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

**నేడు మద్నూర్ మండల సమావేశం**

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ఉదయం పదకొండు గంటలలోపు హాజరు కావాలని కోరారు.

**నేడు ఎల్లారెడ్డిలో 2కే రన్**

ఎల్లారెడ్డి: పట్టణంలో గురువారం జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్సై గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2కే రన్‌లో పాల్గొనే వారు వైట్ టీషర్ట్, షూస్ ధరించి హాజరుకావాలన్నారు.

**నేడు లింగాపూర్ రైతు జేఏసీ సమావేశం**

కామారెడ్డి టౌన్: మాస్టర్‌ప్లాన్‌పై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై గురువారం లింగాపూర్ గ్రామంలో గుడి వద్ద రైతు ఐక్యకార్యచరణ సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్‌ప్లాన్ వల్ల నష్టపోతున్న రైతులందరూ ఈసమావేశానికి ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

**18నుంచి 'కంటి వెలుగు'**

బిచ్కుంద(జుక్కల్): మండలంలో ఈ నెల 18నుంచి 'కంటి వెలుగు' పథకం ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అన్ని గ్రామాలలో 16, 17న దప్పు చాటింపు వేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కంటి వెలుగు పై ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించి శిబిరాలకు తరలించాలని కోరారు.

**అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్ద చెరువుకు తైబందీ**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్ద చెరువుకు బుధవారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో తైబందీ నిర్వహించారు. అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంతో పాటు రంగంపేట్, పోసానిపేట్, ఇస్రోజీవాడి గ్రామాలకు ఆయకట్టు ఉందన్నారు. ఈ నీటితో యాసంగిలో పంటల సాగు కోసం నీటిని వదులుతున్నట్లు ఎంఆర్‌ఐ సాహిత్య తెలిపారు. అడ్లూర్‌ఎల్లారెడ్డికి–550 ఎకరాలకు, రంగంపేట్‌కు–25 ఎకరాలకు, పోసానిపేట్‌కు– 100 ఎకరాలకు, ఇస్రోడివాడికి– 20 ఎకరాల సాగు కోసం చెరువు నీటిని వదులుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇరిగేషన్ ఏఈ సంతోష్, సర్పంచ్ పైడి జానకి జనార్దన్, ఎంపీటీసీలు సంకరి లక్ష్మి రాజలింగం, ఎడ్ల రేణుకా నర్సింలు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## ఉల్లికోడు నివారణ చర్యలు చేపట్టాలి



తిమ్మాపూర్‌లో వరిని పరిశీలిస్తున్న ఏవో నరేష్.. పుల్కల్‌లో అవగాహన కల్పిస్తున్న ఏవో పోచయ్య

గాంధారి(ఎల్లారెడ్డి): యాసంగి వరిలో ఉల్లికోడు నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలని ఏవో నరేష్ సూచించారు. తిమ్మాపూర్ శివారులో ఇటీవల నాట్లు వేసిన వరిపైరును బుధవారం ఆయన పరిశీలించారు. వరి నాటు వేసిన రైతులు నాటు వేసిన 25 నుంచి 30 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కి.గ్రా. చొప్పున ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. దీంతో ఉల్లి కోడు, కాండం తొలుచు పురుగు, అకు చుట్టు పురుగులను నివారించ వచ్చన్నారు.

**భాస్వరం ఎరువులపై అవగాహన**

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్ గ్రామంలో బుధవారం భూమిలో భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులపై ఏవో పోచయ్య రైతులకు అవగాహన కల్పించారు. పంట క్షేత్రాలకు వెళ్లి భూమిలో కరగని భాస్వరంతో ఎలాంటి ప్రయోజనం లేదని సూచించారు. వెంటనే నీటిలో కరిగిపోయే భాస్వరం జీవన ఎరువు పంటలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఏఈవో దయానంద్, రైతులు పాల్గొన్నారు.

**తడి–పొడి సాగు విధానంపై..**

రాజంపేట: మండలంలోని అన్నారం గ్రామంలో బుధవారం రైతులకు వరి పంటలో తడి–పొడి సాగు విధానంపై పద్మపాని సొసైటి స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ అమృతరాజేందర్, ఏఈఓ శిల్ప, సంస్థ కో ఆర్డినేటర్ కొప్పుల రవి తదితరులు ఉన్నారు.

## పంట వివరాల నమోదు సర్వే



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లి, శెట్పల్లిసంగారెడ్డి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రశాంత్‌కుమార్ యాసంగి పంటల సాగు సర్వేను క్షేత్రస్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ పంట చేనుల్లో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు వంటి వివరాలను సేకరించారు. సమాచారాన్ని వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

బాన్సువాడ రూరల్: యాసంగిలో సాగవుతున్న పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నామని బోర్లం క్లస్టర్ ఏఈవో గోపాల్ అన్నారు. బుధవారం ఆయన కొయ్యగుట్టలో రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అలాగే సస్యరక్షణ చర్యలను తెలియజేశారు.

## క్యాలెండర్ల ఆవిష్కరణ



గాంధారి/పిట్లం/దోమకొండ/కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డిరూరల్/బాన్సువాడ రూరల్: తెలంగాణ బీసీ సంఘం కామారెడ్డి జిల్లా శాఖ క్యాలెండర్‌ను బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. అలాగే గాంధారి, దోమకొండలో బీసీ సంఘం క్యాలెండర్‌ను స్థానిక మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. అలాగే పిట్లం, బాన్సువాడలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్‌ను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఎల్లారెడ్డి సొసైటీలో చైర్మన్ నర్సింలు సొసైటీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కామారెడ్డిలో పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్లను జిల్లా ట్రెజరీ అధికారి సాయిబాబా, ఎస్‌టీవో సాయిరెడ్డి ఆవిష్కరించారు.

## బడిబయటి పిల్లల గుర్తింపు

భిక్కనూరు/నాగిరెడ్డిపేట/లింగంపేట(ఎల్లారెడ్డి)/పెద్దకొడప్‌గల్(జుక్కల్): జిల్లాలోని పలు మండలాల్లో బడి మానేసిన పిల్లలను బుధవారం సీఆర్పీలు గుర్తించి, స్థానిక పాఠశాలల్లో చేర్పించారు. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామంలో సీఆర్పీ ముగ్గురిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. నాగిరెడ్డిపేట మండలం బంజరతండా, మెల్లకుంటతండాలో ఇద్దరిని, లింగంపేట మండలంలో ముగ్గురిని, పెద్దకొడప్‌గల్ మండలంలో ముగ్గురిని గుర్తించినట్లు స్థానిక సీఆర్పీలు తెలిపారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, పుస్తకాలు, దుస్తులు అందజేశామన్నారు.



## వడ్డె ఓబన్నకు ఘన నివాళి



కామారెడ్డి టౌన్/మాచారెడ్డి/భిక్కనూరు: జిల్లాకేంద్రంలో గురువారం స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘ నాయకులు ఆయన విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. అలాగే మాచారెడ్డి, భిక్కనూరు మండలకేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో ఓబన్న చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. వడ్డెరలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సంఘ ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పనుల పరిశీలన

పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలలో నిర్వహిస్తున్న పనులను బుధవారం సర్పంచ్ జొన్న విజయరెడ్డి పరిశీలించారు. అనంతరం వారు ఉపాధి కూలీలతో కలిసి మట్టితో బ్యాక్ ఫీలింగ్ చేశారు. నాయకులు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

## రైతుల ఉద్యమానికి చేయూత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌తో నష్టపోతున్న రైతుల ఉద్యమానికి, రైతు జేఏసీకి బుధవారం ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి అండగా నిలిచారు. రైతు జేఏసీకి రూ.50వేలను అందజేసి, వారికి మద్దతుగా నిలిచారు.

## 'యువజన దినోత్సవ' క్రీడాపోటీలు



రామారెడ్డి మండలంలో విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు.. పెద్దకొడప్‌గల్‌లో..

రామారెడ్డి(ఎల్లారెడ్డి)/పెద్దకొడప్‌గల్/బిచ్కుంద/మద్నూర్/పిట్లం(జుక్కల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం యువకులు, విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో క్రికెట్, వాలీబాల్ క్రీడలు, మద్నూర్‌లో కబడ్డీ, వాలీబాల్, వ్యాసరచన పోటీలు, బిచ్కుందలో వ్యాసరచన పోటీలు, పిట్లంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.


పిట్లం మండల కేంద్రంలో..


మద్నూర్ మండల కేంద్రంలో..

## సంక్షిప్తం

**జుక్కల్ ఎస్సైగా మురళి**

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ ఎస్సైగా మురళి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందటి ఎస్సై బాల్‌రెడ్డి జిల్లా పోలీస్ కేంద్రానికి వీఆర్‌లోకి వెళ్లాడు. మెదక్ జిల్లా కేంద్రంలో అటాచ్‌గా ఉన్న మురళి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

**ముమ్మరంగా చెరుకు క్రషింగ్**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం నాటికి 2లక్షల 11వేల 672 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు బుధవారం తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ఎల్లారెడ్డిలో వైద్య పరీక్షలు**

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ రమణ, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

**గౌడ సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభం**

కామారెడ్డి అర్బన్: మండలంలోని చిన్నమల్లారెడ్డిలో బుధవారం గౌడ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ గోపిగౌడ్, ధర్మగొని కిషన్‌గౌడ్, రాజాగౌడ్, నారాగౌడ్, నర్సాగౌడ్, సంతోష్‌గౌడ వెంకటిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం**

దోమకొండ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన కైలాస్ శ్రీనివాస్‌ను బుధవారం మండల పార్టీ నాయకులు సన్మానించారు. జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, దోమకొండ పట్టణ అధ్యక్షుడు సీతారం మధు, నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**కాయకల్పకు ఎంపిక కావడం హర్షణీయం**

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రి కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం హర్షణీయమని సామాజిక ఆశయ సాధన వ్యవస్థాపకులు సందుల గంగారం అన్నారు. బుధవారం ఆయన ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను సన్మానించారు.

**విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత**

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ఎంపీటీసీ శ్రావణి దేవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సింలు, రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు సాయిలు పాల్గొన్నారు.

**నువ్వుల ప్యాకెట్ల పంపిణీ**



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ వారిచే ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 11 మంది ఎస్సీ రైతులకు నువ్వుల ప్యాకెట్లను పంపిణీ చేశారు. విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డీనేటర్ శాస్త్రవేత్త నవీన్, విండో డైరెక్టర్ భాస్కర్, వార్డు సభ్యుడు అశోక్, విండో సీఈవో భైరయ్య, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.